విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

ఎన్నికలకు వేళాయె!

- మోగిన ఎన్నికల నగారా
- ఎన్నికల షెడ్యూల్ విడుదల
- తక్షణం అమల్లోకి ఎన్నికల కోడ్

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: ఎప్పుడు ఎప్పుడా అని ఎదురుచూస్తున్న ఎన్నికల షెడ్యూల్ వచ్చేసింది. సాధారణ ఎన్నికలకు నగారా మోగింది. శనివారం సాయంత్రం గం.3లకు కేంద్ర ఎన్నికల సంఘం పార్లమెంట్, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ విడుదల చేసింది. ఎన్నికల షెడ్యూల్ జారీ అయిన తక్షణం ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ప్రకటించారు. ఇక ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు ఉండవు. రాజకీయ నాయకుల పోస్టర్లు, కటౌట్లు, బ్యానర్లు అన్ని తొలగించాల్సి ఉంటుంది. కొత్త పథకాలు ప్రారంభం కాని, అభివృద్ధి పనుల ప్రారంభం ఉండవు.

ఎన్నికల షెడ్యూల్ షురూ...

కేంద్ర ఎన్నికల సంఘం తెలిపిన వివరాల ప్రకారం ఏప్రిల్18న ఎన్నికల నోటిఫికేషన్ జారీ అవుతుంది. ఏప్రిల్ 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 26వ తేదీన నామినేషన్లను పరిశీలిస్తారు. 29న నామినేషన్ల ఉపసంహరణకు గడువు. ఎన్నికలు మే 13వ తేదీన జరుగుతాయి. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడుతాయి.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఓటర్లు

పశ్చిమగోదావరి జిల్లాలో 7 నియోజకవర్గాలకు కలిపి మొత్తం 14,61,337 ఓటర్లు ఉండగా పురుషులు 7,16,955 పురుష ఓటర్లు,7,44,308 మహిళా ఓటర్లు ఉన్నారు. ఏలూరు జిల్లాలో 7 నియోజకవర్గాలలో 16,24,446 ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 7,93,897, స్త్రీలు 8,30,390 మంది ఓటర్లు ఉన్నారు.

నిబంధనలు కఠిన తరం

అధికారిక పనులను ఎన్నికల ప్రచారంలో కలపకూడదు. ఓటరును ఆర్థికంగా ఇతర ప్రలోభాలకు గురి చేయకూడదు. ప్రభుత్వ పరంగా సాధించిన విజయాలను ప్రభుత్వ ఖర్చుతో ప్రకటనలు ఇవ్వకూడదు. నిరాధారణ ఆరోపణలతో ఇతర పార్టీ లేదా వారి కార్యకర్తలను విమర్శించరాదు. మత విద్వేషాలను రగిల్చే కార్యకలాపాలు నిర్వహించ కూడదు. వేరే పార్టీ సమావేశాలు నిర్వహించే ప్రదేశాలలో ఊరేగింపులు చేపట్టకూడదు. ఇతర పార్టీలు, అభ్యర్థులు జారీచేసిన పోస్టర్లను తొలగించరాదు. ఈ నిబంధనలు అతిక్రమిస్తే ఎన్నికల కమిషన్ నియమావళిని ఉల్లంఘించినట్లు భావించి కఠిన చర్యలు చేపడతారు.

గ్రూప్-1 పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం

- 4,372 మంది విద్యార్థులు
- 5 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

విశాలాంధ్ర-ఏలూరు: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 పరీక్షల నిర్వహణలో భాగంగా ఆదివారం ఏలూరు జిల్లాలో పరీక్షలు ప్రశాంతంగా జరగడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ చెప్పారు. ఏలూరు జిల్లాలో గ్రూప్-1 సర్వీస్ పరీక్షకు హాజరు కానున్న 4,372 అభ్యర్థులకు గాను 5 పరీక్షా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీసు బందోబస్త్, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సిసి కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహణ ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు

పది పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

బాలురు 14,624, బాలికలు 12,802
127 పరీక్షా కేంద్రాలు
జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకట రమణ

విశాలాంధ్ర-భీమవరం టౌన్: పదవ తరగతి పరీక్షలు ఈనెల 18 నుండి 30వ తేదీ వరకు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యా శాఖ అధికారి ఆర్. వెంకటరమణ తెలిపారు. శనివారం జిల్లా కలెక్టరేటు స్పందన సమావేశ మందిరంలో ఎస్.ఎస్.సి పబ్లిక్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై పాత్రికేయుల సమా వేశాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుండి 30 మధ్య నిర్దేశించిన తేదీలలో ఉదయం గం.9:30 నుండి మధ్యాహ్నం 12:45 వరకు ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలు జరుగనున్నట్లు తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 21,341 మంది, గత పరీక్షల్లో తప్పిన వారు 6,085 మంది మొత్తం 27,426 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఓపెన్ స్కూల్ ద్వారా నిర్వహించే ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ ఈనెల 18 నుండి 27 వరకు మధ్యాహ్నం గం. 2.30 నుండి సాయంత్రం 5.30 వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎస్ఎస్సి 997 మంది, ఇంటర్మీడియట్ 1,890 మంది మొత్తం 2,887 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. అన్ని రకాల పరీక్షలు పూర్తయ్యే వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా తగు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించామన్నారు. జిల్లా కలెక్టరు కార్యాల యంలో ఒక కంట్రోలు రూమ్‌ను ఏర్పాటు చేశామని ఉదయం నుండి సాయంత్రం వరకు పనిచేస్తుందని సెల్ ఫోన్ నెంబరు 9346726024 ఎటువంటి సమాచారం కావాలన్నా తెలుసుకోవచ్చునని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్. వెంకట రమణ తెలి పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి విద్యాశాఖ సహాయ కమిషనరు యన్.సత్య నారా యణ, సూపరింటెండెంటు యన్. తిరుపతి రాజు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పగడ్బందీగా పది పరీక్షలకు ఏర్పాట్లు

విశాలాంధ్ర-ఏలూరు: ఈనెల 18 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న టెన్త్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు డీఈవో ఎస్. అబ్రహం చెప్పారు. స్థానిక డీఈవో కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 139 పరీక్ష కేంద్రాలలో మొత్తం 32 వేల 355 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరు అవుతున్నారని తెలిపారు. ఇందులో 16,760 మంది బాలురు, 15,595 మంది బాలికలు ఉన్నారని చెప్పారు. సుమారు మూడు వేల మంది విద్యాశాఖ సిబ్బందిని పరీక్షల నిర్వహణకు నియమించామన్నారు. ఉదయం గం.9. 30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ప్రతిరోజు ఉదయం గం. 8.30 తర్వాతే విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఇస్తామ న్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో అవకతవకలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా విద్యాశాఖ కార్యాల యంలో 81218 40400 నెంబర్ తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని అన్నారు.

జిల్లా రెవిన్యూ అధికారిగా ఉదయభాస్కరరావు

విశాలాంధ్ర-భీమవరం: జిల్లా రెవిన్యూ అధికారిగా జే ఉదయ భాస్కరరావు శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. శనివారం స్థానిక కలెక్టరేటు జిల్లా రెవిన్యూ ఛాంబర్‌లో జె.ఉదయ భాస్కర రావు జిల్లా రెవిన్యూ అధికారిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టరు చాంబర్లో జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలసి పుష్ప గుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు నూతన జిల్లా రెవెన్యూ అధికారికి అభినందనలు తెలిపారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, జిల్లా కలెక్టరు కార్యాలయం, జిల్లా జాయింటు కలెక్టరు కార్యాలయం, జిల్లా రెవెన్యూ అధికారి కార్యాలయ అధికారులు, సిబ్బంది క్రొత్త జిల్లా రెవిన్యూ అధికారి జె.ఉదయ భాస్కర రావు ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు, శుభాకాంక్షలను తెలిపారు.

ఊసరవెల్లి రాజకీయాలు

- పడిపోతున్న నైతిక విలువలు
- నిసిగ్గుగా పార్టీ మారుతున్న నేతలు

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: రాజకీయాలలో విలువలకు తిలోదకాలు ఇస్తున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి నిసిగ్గుగా చేరిపోతున్నారు. ఏ ఎండకు ఆ గొడుగు పడుతూ నైతిక విలువలు కాలరాస్తున్నారు. జంప్‌లు.. హైజంప్ లతో హంగామా సృష్టిస్తున్నారు. ప్రస్తుత రాజకీయ నాయకులను చూస్తుంటే రంగులు మార్చే ఊసరవెల్లి సిగ్గు పడటమే కాదు.. అదే నయమనే భావన కలుగుతోంది. పైకి అభివృద్ధి మంత్రం జపిస్తున్నా... సొంత పనులు చక్కబెట్టుకునేందుకు, ఆస్తులను కాపాడుకునేందుకు ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్నారు. పదవుల కోసం చొక్కా విప్పినంత ఈజీగా పార్టీకి మారుతున్నారు. మరో విచిత్రం ఏమిటంటే.. ఏ పార్టీలో చూసినా అవే ముఖాలు కనిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన పరిణామాలు, రాజకీయాలలో నాయకులు వ్యవహరిస్తున్న తీరును చూసి జనం చీదరించు కుంటున్నారు. ఇవేం రాజకీయాలంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. తూ.. నీ బతుకులు చెడ.. అంటూ తిట్ల దండకం అందుకుంటున్నారు.

ఏ పార్టీలోనైనా అవే ముఖాలు

నీతి, నియమం లేదు. ప్రజాసేవ అసలే లేదు. పదవి ఉంటే పార్టీలో ఉండటం.. పదవి ఊడితే ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరిపోవటం నేడు ఫ్యాషన్‌గా మారింది. స్వప్రయోజనాల కోసం రాజకీయాలను భ్రష్ట పట్టిస్తున్నారు. ఎన్నుకున్న, నమ్ముకున్న ప్రజలు ఏమనుకుంటారో అన్న కనీసం స్థాయిని మరిచి వ్యవహరిస్తున్నారు. జనం చీకొడతారని తెలిసి కూడా నిసిగ్గుగా వలసలు కొనసాగిస్తున్నారు. దీనికంతటికి అభివృద్ధి, సంక్షేమం అంటూ కలరింగ్ ఇచ్చుకుంటున్నారు. సంవత్సరాల తరబడి పదవులను అనుభవిస్తున్నారు. దీంతో కొత్తవారికి చోటేది...? కొత్త ముఖాలకు స్థానం ఏది...? ద్వితీయ శ్రేణి నాయకత్వానికి అవకాశాలేవి...? పార్టీ కోసం కష్టపడిన నాయకుల పరిస్థితి ఏమిటి...? అన్న ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయి. రాష్ట్రంలో టిడిపి, వైసిపి, జనసేన, కేంద్రంలో బిజెపి అభ్యర్థుల విజయం కోసం అహోరాత్రులు కష్టించి పనిచేసిన సేవకులను ఆ పార్టీలు మోసం చేస్తున్నాయి.

కార్యకర్తల పరిస్థితి అగమ్య గోచరం

ఏ పార్టీకైనా బలం... బలగం.. కార్యకర్తలే. అధికారంలో ఉన్నా... లేకపోయినా పార్టీకి చిత్తశుద్ధితో పనిచేస్తారు. కార్యకర్తల త్యాగ ఫలితమే వారు అనుభవిస్తున్న పదవులు. కానీ కొంతమంది నాయకులు ఈ విచక్షణ మరచి పదవుల కోసం అర్రులు చాస్తున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ కండువా కప్పుకుంటున్నారు. కార్యకర్తలు మాత్రం.. ఎన్ని కేసులైనా.. నిర్బంధాలు విధించినా.. తాము నమ్ముకున్న పార్టీ సిద్ధాంతాల కోసం ఊపిరి ఉన్నంతకాలం పనిచేస్తూనే ఉంటారు. దాడులు ప్రతిదాడులతో ఇబ్బందులు ఎదురైనా పార్టీ జండా వీడరు. ఆ జెండా నీడలోని ఒదిగిపోతారు. అంత నిబద్ధత, నిజాయితీ కార్యకర్తలకు ఉంటుంది. కానీ నాయకులు ప్రజాప్రతినిధులు మాత్రం రాత్రికి రాత్రే పార్టీ మారి క్యాడర్‌కు తీరని ద్రోహం చేస్తున్నారు. నమ్ముకున్న వారిని నట్టేట ముంచుతున్నారు.

నయవంచకులదే రాజ్యం

రోజురోజుకు రాజకీయాలలో నైతిక విలువలు నశిస్తున్నాయి. అధికారం లేకపోతే ఒక క్షణం కూడా ఉండలేకపోతున్నారు. రాజకీయ జీవితాన్ని ఇచ్చిన పార్టీ అధికారం కోల్పోతే అండగా ఉండాల్సింది పోయి క్షణం ఆలోచించకుండా అధికార పార్టీలో చేరిపోతున్నారు. పాత పరిచయాలతో కాళ్ళ వేళ్ళబడి ఆస్తులను రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు. కౌన్సిలర్ నుంచి మొదలుకొని మేయర్ వరకు, సర్పంచ్ నుంచి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీల వరకు అందరూ నీతి బాహ్య రాజకీయాలకు తెరతీస్తున్నారు.

భ్రష్టు పట్టిన రాజకీయాలు

ప్రస్తుత రాజకీయాలు భ్రష్టుపట్టాయి. నీతి నియమం లేదు. ప్రజలు ఏమంటారోనన్న భయం లేదు. దొంగలు దొంగలు ఊర్లు పంచుకున్నట్లు పదవులను పంచుకుంటున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1982 వరకు కాంగ్రెస్‌లో ఉన్న వారంతా టిడిపిలోకి 2019 ఎన్నికలలో వైసీపీ అధికారం చేపట్టిన తర్వాత మళ్లీ ఆ పార్టీ కండువాలు కప్పుకున్నారు. తాజాగా మళ్లీ టిడిపి,బిజెపి, జనసేన కూటమిగా ఏర్పడిన తర్వాత ఏ పార్టీ తరఫున టికెట్ కేటాయిస్తే ఆ పార్టీలో సునాయాసంగా చేరిపోతున్నారు. నమ్ముకున్న కార్యకర్తలకు పంగనామాలు పెడుతూ... పార్టీలు మారుతుండడం విస్మయానికి గురిచేస్తున్నది.

ఎన్నికల నియమావళిని వెంటనే అమలు చేయాలి

విశాలాంధ్ర భీమవరం: భారత ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ 16 వ తేదీ శనివారం విడుదల చేసిందని జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.నోటిఫికేషన్ విడుదల - ఏప్రిల్ 18, నామినేషన్లకు చివరి తేదీ - ఏప్రిల్ 25, నామినేషన్ల స్క్రూటినీ- ఏప్రిల్ 26, నామినేషన్ల విత్ డ్రా కు అవకాశం- ఏప్రిల్ 29, ఎన్నికల తేదీ - మే 13, ఎన్నికల కౌంటింగు - జూన్ 04 జరుగుతాయన్నారు. నేటి (శనివారం) నుండి ఎన్నికల నిమావళి అమలులో ఉంటుందని, రాజకీయ పార్టీల ప్రచార బ్యానర్స్, కటౌట్లు, వాల్ పోస్టర్లు, ఫోటోలు తొలగింపు, రాజకీయ పార్టీల నాయకులు విగ్రహాలను వస్త్రం కప్పి ఉంచడం, తదితర పనులను అన్నింటిని నిర్ణీత గడువులోపుగా సంబంధిత అధికారులు పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలన్నారు. గడువు అనంతరం ఫిర్యాదులు అందితే చర్యలువ తప్పవని జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్ ఆ ప్రకటనలో హెచ్చరించారు.

స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తా

విశాలాంధ్ర -భీమవరం టౌన్: ప్రజల,రైతుల ,బడుగు బలహీన వర్గాల ఆకాంక్ష మేరకు ఉండి శాసనసభ నియోజకవర్గం నుండి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తు న్నట్లు వేటుకూరి శివరామ రాజు(శివ) తెలిపారు. శనివారం భీమ వరంలోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 20 సంవత్సరాలుగా ప్రజా సేవకుడిగా ప్రజలతో మమేకమై ఉన్న తాను ప్రజలకు మరింతగా సేవలు అందించడానికి ఉండి శాసనసభ అభ్యర్థిగా, ప్రజాక్షేత్రంలో మూడోసారి పోటీ చేస్తున్నట్లు శివ తెలిపారు . 20 సంవత్సరాల క్రితం శివ స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేసి ప్రజలకు విద్యా, వైద్య సేవలను ,సామాజిక సేవలను అందించాన న్నారు. ఈ సమావేశంలో ఉండి ఏ యం.సి మాజీ చైర్మన్ సాగిరాజు సాంబశివరాజు, నడింపల్లి వెంకటరాజు, మంతెన రవి రాజు ఇందుకూరి అప్పలరాజు, ఇందుకూరి మురళీకృష్ణ రాజు ,మోపిదేవి శ్రీనివాస్ , బురిడి రవిబాబు, కలవపూడి సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావు మృతి పార్టీకి తీరనిలోటు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : సిపిఐ సీనియర్ నాయకులు, కొయ్యలగూడెం మండలం తిమ్మన కుంట గ్రామ శాఖ కార్యదర్శి దగాని వెంకటేశ్వరరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం సిపిఐకి తీరని లోటు అని సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం తిమ్మన కుంట గ్రామంలో దగాని వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను పార్టీ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా జమ్మి శ్రీనివాసరావు మాట్లాడుతూ దగాని వెంకటేశ్వరరావు 2004వ సంవత్సరంలో సిపిఐలో చేరి కొండగుట్ట, పోడు భూములు పై అనేక పోరాటాలు చేసి నిరుపేదలకు లబ్ధి చేకూరేలా పోరాటాలు కొనసాగించారని అన్నారు. వెంకటేశ్వరరావు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని శ్రీనివాసరావు తెలిపారు. దగాని వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో సీనియర్ నాయకులు దుగ్గిరాల నారా యణరావు, గుదే శ్రీను, పెదకాపు, తదితరులు పాల్గొన్నారు.

ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది

విప్పర్తి రమణ W/o. విప్పర్తి రమేష్, డోర్‌నెం. 4-120/2, ఉంగుటూరు (గ్రా), ఉంగుటూరు(మం), ఏలూరు జిల్లా, నేను ది. 15-02-2024వ తేదీన నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు నెం.M8228660 ను ఒక పాలిథిన్ కవరులో పెట్టుకుని జిరాక్సు తీయు నిమిత్తం మా ఇంటి వద్ద నుండి ఉంగుటూరు సెంటరుకు వెళ్తుండగా మార్గమధ్యంలో కవరులో పెట్టిన నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు జారి పడిపోయినది. నేను మరలా మార్గ మధ్యంలోనూ, పరిసర ప్రాంతాల్లోనూ ఎంత వెదికినా నా యొక్క ఒరిజినల్ పాసుపోర్టు గల కవరు దొరకలేదు. నా ఒరిజినల్ పాస్‌పోర్టు దొరికినవారు పైన తెలిపిన అడ్రసులో అందచేయప్రార్థన.

CHANGE OF NAME

I, Penmatsa Narasimha Raju, S/o Satyanarayana resident 1-46, Sriramapuram, Vempa, Bhimavaram Mandal, W.G.Dist., A.P-534207. I Have Changed my name from Penmatsa Narasiha Raju (Old Name) to Penmatsa Narasimha Raju (New name). Hence after all my documents and correspondence will be continue with my new name Penmatsa Narasimha Raju.

పోస్టర్ల తొలగింపు

విశాలాంధ్ర - భీమవరం టౌన్: జిల్లాలోని పలు రాజకీయ పార్టీ నాయ కులు అధికారికంగా అనధికారికంగా, విచ్చలవిడిగా వివిధ రాజకీయ నాయకుల భారీ కటౌట్లు ఎటు చూసినా బ్యానర్లతో నిండిపోయాయి. శనివారం మధ్యాహ్నం నుంచి ఎన్నికల కోడ్ అమలు కావడంతో వేల రూపాయలతో ఏర్పాటుచేసిన బ్యానర్లను, కటౌట్లను, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, తొలగింపు చర్యలు చేపట్టారు.

వైసీపీ నూజివీడు అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రతాప్

విశాలాంధ్ర -నూజివీడు : నూజివీడు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావును అధిష్ఠానం ప్రకటించింది. 2004లో కాంగ్రెస్ అభ్యర్థిగా నూజివీడు నియోజకవర్గం నుండి ఆయన గెలు పొందారు. అనంతరం 2009లో టిడిపి అభ్యర్థి చిన్నం రామకోటయ్యపై పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం 2014లో వైఎస్ఆర్ సీపీలో చేరిన ఆయన టిడిపి అభ్యర్థి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు పై గెలుపొందారు. మరలా 2019వ సంవత్సరంలో వైఎస్ఆర్ సీపీ తరఫున పోటీ చేసి టిడిపి అభ్యర్థి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు పై రెండవసారి గెలుపొందారు. మొత్తం మూడుసార్లు నూజివీడు నుండి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రస్తుతం అధిష్టానం నూజివీడు నియోజకవర్గ అభ్యర్థిగా మేక వెంకట ప్రతాపప్పారావుకి అవకాశం కల్పించడంతో ఆయన మరోసారి ఎన్నికల బరిలో నిలవనున్నారు.

భీమవరం వైసీపీ అభ్యర్థిగా గ్రంధి శ్రీనివాస్

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి వైసిపి నుండి భీమవరం సిట్టింగ్ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను అభ్యర్థిగా నియమిస్తూ పార్టీ అధిష్టానం శనివారం అధికారికంగా ప్రకటించింది. దీంతో నియోజవర్గంలో పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ను ముఖ్యమంత్రి జగన్ భీమవరం బహిరంగ సభలోనే రియల్ హీరోను మీ ముందు నిలబెడుతున్నానని ఆనాడే అధికారికంగా వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా అభ్యర్థులను ప్రకటిస్తున్న నేపథ్యంలో గ్రంధి శ్రీనివాస్ పేరును అధిష్టానం అధికారికంగా ప్రకటించింది. 2004లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆనాడు కాంగ్రెస్ పార్టీ నుండి మొదటిసారి భీమవరం నియోజకవర్గ ఎమ్మెల్యేగా గ్రంధి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. తిరిగి 2019లో రాజశేఖర్ రెడ్డి తనయుడు, ముఖ్యమంత్రి జగన్ ఆధ్వర్యంలో రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

ఉంగుటూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా వాసుబాబు

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఉంగుటూరు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పుప్పాల శ్రీనివాసరావు (వాసు బాబు)ను వైసిపి అధిష్టాన వర్గం శనివారం ఖరారు చేసింది. వైసీపీ తరఫున వాసు బాబు మూడోసారి ఎన్నికల బరిలో పోటీ చేయ నున్నారు. వాసు బాబు 2009 ఎన్నికల్లో ఓటమి చెందారు. 2014 ఎన్నికల్లో వాసు బాబు 33,153 భారీ ఓట్లతో విజయం సాధించారు. మూడోసారి పోటీ చేయటానికి వైసిపి పార్టీ ఖరారు చేసింది. దీంతో ఉంగుటూరు నియోజవర్గంలో వైసిపి నాయ కులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం భువనపల్లి వెళ్లి అక్కడ వైసిపి నాయకులు కేక్ కట్ చేశారు. వాసు బాబుకు శుభాకాంక్షలు తెలిపారు. వాసు బాబు రెండోసారి గెలుపు ఖాయం వైసీపీ ప్రజాప్రతి నిధులు, వైసీపీ నాయ కులు, కార్యకర్తలు అంటున్నారు.

ఉండి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నరసింహరాజు

విశాలాంధ్ర-పాలకోడేరు: ఉండి నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పి వి ఎల్ నరసింహరాజును ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రకటించడంతో పాలకోడేరు మండలంలో పలువురు వైసిపి నాయకులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ, అభ్యర్థిగా ఎన్నికైన పివిఎల్ నరసింహా రాజుకు అభినందనలు తెలియజేస్తూ సంబరాలు జరుపుకున్నారు. పాలకోడేరు మండల పరిషత్ అధ్యక్షులు భూపతి రాజు సత్యనారాయణ రాజు(చంటి రాజు), వైసిపి మండల అధ్యక్షురాలు కటిక శ్రీదేవి,పాలకోడేరు ఉప సర్పంచ్ దెందుకూరి వెంకటరాజు, బీసీ కులాల జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింతపల్లి గురు ప్రసాద్, ఉండి ఏఎంసి వైస్ చైర్మన్ చెరుకూరి రాజ నరేంద్ర, విస్సాకోడేరు గ్రామ సర్పంచ్ బొల్లా శ్రీనివాస్, శృంగ వృక్షం సర్పంచ్గంగం సూరిబాబు, గొరగనమూడి మాజీ సర్పంచ్ చెల్లుబోయిన పాపారావు, ఇతరమండల,గ్రామస్థాయి వైసిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆచంట ఎమ్మెల్యే అభ్యర్థిగా చెరుకువాడ

విశాలాంధ్ర-ఆచంట: మళ్లీ ఆచంట నియోజకవర్గానికి రంగనాధరాజును ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలుపుతూ పోడూరు మండలం తూర్పు పాలెం క్యాంపు కార్యాలయంలో చెరుకువాడ శ్రీరంగనాధ రాజును పూల మాలలతో సత్కరించి స్వీట్స్ తినిపించి, మళ్లీ ఆచంట నియోజకవర్గం విజయ పథంలో నడిపిం చేందుకు మేమంతా సిద్ధంగా ఉన్నామని అభినందనలు తెలిపారు. మీ వెంటే మేము అందరం ఉన్నామని ఒకరికి ఒకరు స్వీట్స్ పంచుకొని పండగ వాతావరణంలో ఉన్న కార్యకర్తలు నాయకులు సంబరాలు చేసుకున్నారు.

కైకలూరు వైసీపీ అభ్యర్థిగా దూలం నాగేశ్వరరావు

విశాలాంధ్ర - కైకలూరు : కైకలూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా దూలం నాగేశ్వరరావును ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయనకు ఎమ్మెల్సీ జయ మంగళ వెంకటరమణ అభినందనలు తెలిపారు. జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో కైకలూరులో మరోసారి వైసీపీ విజయం తథ్యం అన్నారు. డీఎన్ఆర్ ను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించి జగనన్నకు బహుమతి ఇస్తామని అన్నారు. 2వ సారి కైకలూరు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా దూలం నాగేశ్వరరావు పేరు ప్రకటించడం పట్ల జయమంగళ సయ్యపురాజు గుర్రాజు హర్షం వ్యక్తం చేశారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు

కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జేసీ లావణ్య వేణి

విశాలాంధ్ర - ఏలూరు: నేటి యువతకు అమరజీవి పొట్టిశ్రీరాములు ఆదర్శప్రాయుడని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని యువత అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. పొట్టిశ్రీరాములు జయంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి. లావణ్య వేణి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ భాష ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు విశేష కృషి చేసిన మహాపురుషుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో పొట్టి శ్రీరాములు గాంధీ మార్గంలో నడిచి అనేక ఉద్యమాలలో ప్రముఖపాత్ర వహించి స్వాతంత్ర్య సమర యోధునిగా గుర్తింపబడ్డారని తెలిపారు. కార్యక్రమంలో డి ఆర్ వో డి. పుష్పమణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ,డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.శర్మిష్ఠ,డిఆర్ డిఏ పిడి డాక్టర్ ఆర్. విజయ రాజు బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం. పుష్పలత, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఆర్. నాగరాణి, డ్వామా పి.రాము, ఆర్ డబ్ల్యు ఏస్ ఎస్ఈ సత్యనారాయణ,జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ఘంటా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు మహాత్యాగి

కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ్ర-భీమవరం: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు చిరస్మర ణీయులని కలెక్టరు సుమిత్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టరు కార్యాల యంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు 124 జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి కలెక్టరు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు విశేష కృషి చేసిన మహాపురుషుడు పొట్టి శ్రీరాములు అన్నారు. మనమందరం స్వార్థం తగ్గించుకుని సమాజానికి కొంత సేవ చేస్తే ఆయనకు ఘనమైన నివాళులు అర్పించిన వారమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టరు, జిల్లా గృహ నిర్మాణ శాఖ పిడి కానాల సంగీత్ మాధుర్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జి.గణపతిరావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకట రమణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పదవతరగతి పరీక్షలకు ఏర్పాట్లు

విశాలాంధ్ర : లింగపాలెం : లింగపాలెం మండలంలో పదవతరగతి పరీక్షలకు ఏర్పాట్లు చేసినట్లు మండల విద్యాశాఖాధికారి రామారావు తెలిపారు. మండలంలో 8 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో 466 మంది పరీక్షలు రాయనున్నారని, 265 మంది బాలురు, 266 మంది బాలికలు ఉన్నారని అన్నారు. 6 ప్రయివేటు పాఠశాలల నుంచి 230 మంది పరీక్షలకు అర్హులని మండలంలో మొత్తం 696 మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాలుగా ధర్మాజీగూడెం మెయిన్ స్కూలు శింగగూడెం, రంగాపురం ఉన్నత పాఠశాలలు, ధర్మాజీగూడెం హెూలీట్రినిటి పాఠశాలలను ఏర్పాటు చేసి నట్లు వివరించారు. పరీక్షలు రాసే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా కుర్చీలు, బెంచీలు, ఫ్యాన్లు, లైటింగ్ సౌకర్యం కల్పించామని అన్నారు.

బాదరాల వాసి గుడివాడలో మృతి

విశాలాంధ్ర-లింగపాలెం : బాదరాల వాసి గుడివాడలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన సంఘటన జరిగింది. బాదరాలకి చెందిన ఆర్.వీర వెంకట రావు (35) గుడివాడ లో విద్యుత్ ఉప కేంద్రం లో షిఫ్ట్ ఆపరేటర్ గా పనిచేస్తున్నాడు. డ్యూటీకి వెళ్తున్న సమయంలో చేపల లోడుతో వెళ్తున్న లారీ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య,కొడుకు, కూతురు ఉన్నారు. గ్రామవాసి మృతి చెందడంతో బాదరాల నుంచి పెద్ద సంఖ్య లో గుడివాడ తరలి వెళ్లారు. ఇతని మృతి పై తీవ్ర విషాదం నెలకొంది. స్వగ్రామం వచ్చి ఇంటి వద్ద పనులు చూసుకుని తిరిగి గుడివాడ డ్యూటీకి వెళుతుండగా ఈ సంఘటన జరిగిందని స్థానికులు తెలిపారు.

ఇండియన్ డిజిటల్ స్కూల్లో వైజ్ఞానిక ప్రదర్శనలు

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం ఇండియన్ డిజిటల్ స్కూల్ విద్యార్థిని విద్యార్థులు చేసిన సైన్స్ ప్రాజెక్ట్ లు అందరిని ఆకట్టుకున్నాయి గ్లోబల్ వార్మింగ్, చంద్రాయన్ -3, విండో ఎలర్జీ, హైడ్రాలిక్ ఎలర్జీ మొదలగు ప్రాజెక్టు ఆకట్టు ఉన్నాయని గణప వరం ఎంఈఓ- 2 జి బాలయ్య అన్నారు. శనివారం స్కూల్లో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనకు ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నతనం నుంచే ఇటువంటి ప్రదర్శనలు చేయించడం ద్వారా పిల్లలు భవిష్యత్తులో మంచి పురోగతిని సాధిస్తారని ఆయన అన్నారు. ఇండియన్ డిజిటల్ స్కూల్ డైరెక్టర్ జి వి ప్రసాద్‌ను, ప్రిన్సిపాల్ జి. పద్మిణీదుర్గలను ఎంఈఓ అభినందించారు.

కోర్టు కేసు నుంచి విముక్తి పొందడానికి జాతీయ లోక్ అదాలత్ మంచి వేదిక

విశాలాంధ్ర-ఏలూరు: కోర్టు కేసులనుంచి విముక్తి పొందడానికి జాతీయ లోక్ అదాలత్ కక్షిదారులకు మంచి వేదికని రెండవ అదనపు జిల్లా జడ్జి పి. మంగకుమారి తెలిపారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలోవున్న న్యాయసేవాధికార సంస్థ భవనంలో జాతీయ లోక్ అదాలత్ ప్రారంభంలో భాగంగా తొలుత కక్షిదారులు, న్యాయవాదులతో జాతీయ లోక్ అదాలత్ న్యాయ విజ్ఞాన సదస్సు జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె. రత్నప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో రెండవ అదనపు జిల్లా జడ్జి పి. మంగకుమారి మాట్లాడుతూ కోర్టు కేసుల నుంచి విముక్తిపొంది ప్రశాంత జీవనం పొందడానికి కక్షిదారులకు జాతీయ లోక్‌అదాలత్ మంచి వేదికని దీనిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తి కెకెవి బుల్లి కృష్ణ, ప్రభుత్వ న్యాయవాది బి.జె.రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోనే సీతారాం, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఎన్ ఎం ఎం నాగరాజు, దిశ సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్బారావు, తదితరులు జాతీయ లోక్ అదాలత్ గురించి వివరించారు.

జగన్ దుష్ట పాలన అంతం కోసమే పొత్తు

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, అరాచకాలను అంతమొందించి సైకో జగన్ దుష్టపాలనకు వీడ్కోలు పలికేందుకు టిడిపి, జనసేన, బీజేపీ కలయిక రాష్ట్ర విస్తృత ప్రయోజనాల దృష్ట్యా ఎంతో అవసరమని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి అన్నారు. రానున్న ఎన్నికల కురుక్షేత్రంలో జగనాసుర వధ జరగాలంటే ప్రతిఒక్కరూ పెద్ద మనసుతో కూటమికి అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఏలూరులో శనివారం ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మాజీ చైర్‌పర్సన్, మున్సిపల్ మాజీ చైర్మన్ మధ్యాహ్నపు ఈశ్వరి, ఎమ్మార్డీ బలరాం దంపతులతో వారి స్వగృహంలో ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి ఆత్మీయ భేటి అయ్యారు. ఈ సందర్భంగా వారి మధ్య సుహృద్భావ వాతావరణంలో చర్చలు జరిగాయి. టిడిపి, జనసేన, బీజేపీ పార్టీల పొత్తు ఏపికి మేలు కలయికగా నిలుస్తుందని, ఈ కలయిక రాష్ట్రానికి శుభ సూచికమని బడేటి చంటి వారికి వివరించారు.

కైకరంలో రోశయ్య విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర - ఉంగుటూరు : ఆర్యవైశ్య సంఘానికి గుర్తింపు తెచ్చిన మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ కీ.శే. కొణిజేటి రోశయ్యను ఆర్య వైశ్యులు ఎల్లప్పుడూ గుర్తించుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఉంగుటూరు మండలం కైకరం గ్రామంలో శనివారం స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని ప్రపంచ ఆర్యవైశ్య సంఘం ఏపీ ఉపాధ్యక్షులు మారం వెంకటేశ్వరరావు ప్రారంభిస్తారన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ గ్రామంలో అనేక విగ్రహాలను ఏర్పాటు చేస్తున్న దాత కోన శ్రీనివాసులు అభినందించారు. ప్రపంచ ఆర్యవైశ్య సంఘం మహాసభ ఏపీ అధ్యక్షుడు కోన శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్య వైశ్యుల అభ్యున్నతికి , సేవా కార్యక్రమాలకు ఎల్లప్పుడూ ముందుంటానన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య రాష్ట్ర యూత్ అధ్యక్షులు కోన హనుమాన్ బాబు, మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కూటమికి ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం : కూటమికి ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం అని జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక మాగంటి కళ్యాణ మండపంలో జనసేన బిజెపి తెలుగుదేశం ఉమ్మడి ఆత్మీయ సమావేశం జరిగింది. రాష్ట్రం ఐదేళ్లు అంధకారంలోకి వెళ్లిపోయిందని సంక్షేమ ముసుగులో రాష్ట్రాన్ని దోచుకు తింటున్న వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలంటే కూటమికి ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని బతికించాలని జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. బిజెపి నాయకురాలు భోగిరెడ్డి ఆదిలక్ష్మి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర శ్రేయస్సు నిమిత్తం ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాసును రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపిద్దాం అని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు గొర్రెల శ్రీధర్, పరిమి రవికుమార్, పోతుల అన్నవరం, పాతూరి రాంప్రసాద్ చౌదరి తదితరులు హాజరయ్యారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర- పోడూరు :పోడూరు మండలంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈనెల 18 నుండి ప్రారంభమవుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను పోడూరు మండలంలో మూడు పరీక్ష కేంద్రాలలో నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖాధికారి జివిఎస్ విజయకుమార్ తెలిపారు. పబ్లిక్ పరీక్షల నిర్వహణకు పోడూరు మండలంలో పోడూరు, జిన్నూరు, గుమ్ములూరు జిల్లా పరిషత్ హైస్కూల్స్ నందు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చెయ్యటం జరిగిందని ఈ పరీక్ష కేంద్రాలలో పబ్లిక్ పరీక్షలు రాయడానికి మండలంలోని ఎనిమిది జిల్లా పరిషత్ హైస్కూల్స్ 2 ప్రైవేట్ హైస్కూల్స్ నుండి 527 మంది విద్యార్థులుహాజరవుతారన్నారు.ఇందులో 240 మంది బాలురు కాగా 208 మంది బాలికలు ఉన్నారన్నారు. 547 మంది విద్యార్థుల లోను 249 మంది తెలుగు మీడియంలోనూ 278 మంది ఇంగ్లీష్ మీడియంలోనూ పరీక్షలు వ్రాయనున్నారని ఎంఈఓ విజయ్ కుమార్ తెలిపారు.

పోరు రసవత్తరం

విశాలాంధ్ర- ఉంగుటూరు: ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గంలో గెలిచే పార్టీ రాష్ట్రాన్ని ఏలుతుందనే నానుడి ఉంది. కాగా ఈ సారి ఉంగుటూరు అసెంబ్లీ ఎన్నికల బరిలో అధికార విపక్ష పార్టీల అభ్యర్థులది ఒకటే మండలం కావడం విశేషం. అదే నిడమర్రు మండలం. ఎన్నికల కోడ్ కూసిన వేళ అభ్యర్థుల ప్రచారం ఊపందుకుంటోంది. కాగా నిడమర్రు మండల వాసుల్లో ఫుల్ జోష్ కానవస్తోంది. అటు వైసీపీ అభ్యర్థి పుప్పాల వాసుబాబు నిడమర్రు మండలంలోని బువ్వనపల్లికి చెందిన వారు. ఇటు జనసేన ,టిడిపి, బిజెపి ఉమ్మడి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజునిడమర్రు మండలంలోని ఫతేపురం వాసి. ఈ ఇద్దరు ప్రధాన అభ్యర్థుల మధ్య ఎన్నికల పోరు రసవత్తరంగా మారనుంది.వారిలో మా వాడే కాబోయే ఎమ్మెల్యే అనే సంబరం కొట్టొచ్చినట్లు కనబడుతోంది.ఈ దశలో మా మండలానిదే ఎమ్మెల్యే పీఠం అంటూ నిడమర్రు మండలం వాసులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

భారీ మెజారిటీతో గెలిచి గూడెం సీటు జగన్‌కు గిఫ్ట్‌గా ఇద్దాం



విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: వైకాపా అధినేత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మన మీద ఎంతో నమ్మకంతో గౌరవంతో మనకు మళ్ళీ టికెట్ ఇచ్చారు. కాబట్టి ఆ నమ్మకాన్ని నిజం చేస్తూ గౌరవాన్ని నిలబెట్టుకుంటూ భారీ మెజారిటీతో తాడేపల్లిగూడెం సీటును గెలిచి జగన్‌కు గిఫ్ట్ గా ఇద్దామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గ వైకాపా అభ్యర్థి కొట్టు సత్యనారాయణ అన్నారు. అభ్యర్థిగా ప్రకటించిన అనంతరం శనివారం తొలిసారిగా ఆయన తాడేపల్లిగూడెం మండలం నందమూరు గ్రామాన్ని సందర్శిం చారు. గ్రామంలోని శ్రీవెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు, అందరం ఐకమత్యంతో ప్రజల దగ్గరకు వెళదామని ప్రకటించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పట్ల ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనపట్ల ప్రజలందరూ ఆకర్షితులు అయినందున మళ్లీ తిరిగి గెలిచే పార్టీ కాబట్టి ఎక్కువ మంది టికెట్లు ఆశించడం సహజమన్నారు. ఆశావహులంతా అధినేత నిర్ణయానికి కట్టుబడి పార్టీ విజయానికి కృషి చేయాలని మంత్రి కొట్టు సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు.

జనసేన జెండా ఎగరటం ఖాయం

విశాలాంధ్ర-వీరవాసరం: రాబోయే ఎన్నికల్లో భీమవరం నియోజకవర్గంలో జనసేన జెండా ఎగరటం ఖాయమని వీరవాసరం జెడ్పీటీసీ గుండా జయప్రకాష్ నాయుడు, నియోజకవర్గ తెలుగు యువత నేత కౌరు శివకృష్ణ తెలిపారు. టిడిపి, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా జనసేన అభ్యర్థిగా పోటీ చేయబోతున్న పులపర్తి రామాంజనేయులును వారు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు చెప్పి మాట్లాడుతూ మేమంతా కష్టపడి పనిచేసి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ ఇళ్ల శ్రీరాములు, పంపన నరసింహమూర్తి, దంపనబోయిని శ్రీనివాసు, దొంగ వెంకట నారాయణ, బొంతు రాము, దొంగ సత్యనారాయణ, జోగి నరసింహ, దొంగ బుజ్జి, దొంగ శ్రీనివాసు(గోపాలం), కేతా శ్రీనివాసు, పంపన వీర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని జిల్లా అదనపు ఎస్పి వి. భీమారావు అన్నారు. శనివారం పోలీస్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి జయంతి వేడుక నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి, ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఎంతగానో కృషి చేసారన్నారు. మహాత్మాగాంధీ భోదించిన సత్యం, అహింసా, హరిజనోద్ధరణకు జీవితాం తం కృషి చేసిన మహనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్మ్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ (అడ్మిన్) టి.శ్రీకాంత్, ఆర్మ్ రిజర్వు సిబ్బంది, జిల్లా పోలీసు కార్యాలయ ఉద్యోగులు పాల్గొని, అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలను సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు.

పాలకొల్లులో: పాలకొల్లు జీవిఎస్‌విఆర్ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో పొట్టి శ్రీరాములు 123వ జయంతి కార్యక్రమం, పాలకొల్లు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థుల నడుమ శనివారం ఘనంగా నిర్వహించారు. వాసవి క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్స్ శ్రీఖాకొల్లు మైథిలి సహకారంతో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు బహూకరించారు. మైథిలి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆంధ్రరాష్ట్రానికి చేసిన త్యాగం ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. ఆయన సేవలు రాష్ట్రానికి ఆదర్శప్రాయం అన్నారు. పాఠశాల హెచ్ఎం రాయపూడి భవాని ప్రసాద్, పర్యవేక్షించారు. వాసవి క్లబ్ పాలకొల్లు అధ్యక్షులు మాటూరి సోమేశ్వర వెంకట రామ్ కుమార్,

ట్రెజరర్ మాఘం శ్రీనివాసరావు, మాటూరి వీర వెంకట నరసింహమూర్తి, జోన్ చైర్మన్ పచ్చిగోళ్ళ సత్యనారాయణ మూర్తి, పాస్ట్ ప్రెసిడెంట్స్ శ్రీఖాకోల్లు కామేశ్వరరావు, యిమ్మిడి రాజేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉంగుటూరులో : ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కొరకు అమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించి, అమరజీవి అయి మహా పురుషుడు పొట్టి శ్రీరాముల ని ప్రపంచ

ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కోన శ్రీనివాస్ అన్నారు. శనివారం ఉంగుటూరు మండలం కైకరం గ్రామంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు జరిగాయి. పొట్టి శ్రీరాములు విగ్రహానికి కోన శ్రీనివాస్, ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మారం వెంకటేశ్వరరావు, రాష్ట్ర యూత్ అధ్యక్షులు హనుమాన్ బాబు తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

టి నరసాపురంలో: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయులు పొట్టి శ్రీరాములు అని టి నరసాపురం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మాదంశెట్టి సోమరాజు అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతి వేడుకలు టి.నరసాపురంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భగా ఆయన

మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములు ఆంధ్రుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఆర్యవైశ్యసంఘం మాజీ అధ్యక్షులు మాదంశెట్టి మల్లిఖార్జునరావు, కొనకళ్ల మోహన్, బీమవరపుచక్రధరరావు, మాటూరి ఈశ్వరప్రసాద్, చవ్వా నరసింహా రావు, మాదం శెట్టి రామకృష్ణ, వంటిపల్లి సురేష్,కన్నం మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

స్టార్టప్‌లు కీలకం

విశాలాంధ్ర -భీమవరం: వికసిత భారత లక్ష్యాలు సాధించాలంటే విద్యార్థులు నిర్మించే స్టార్టప్ లే కీలకమని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ దండు జగన్నాథరాజు పేర్కొన్నారు. ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ కెమిస్ట్రీ, ఇంజనీరింగ్ ఫిజిక్స్, ఏఐసిటి ఐడియా ల్యాబ్ సంయుక్త ఆధ్వర్యంలో అనుసంధాన అనే ప్రత్యేక కార్యక్రమాన్ని శనివారం

నిర్వహించారు. విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలతో రూపొందించిన ప్రాజెక్టులు పరిశీలించిన డాక్టర్ జగన్నాథరాజు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఆలోచనలను ప్రజెంటేషన్ రూపంలోనూ ఒక మోడల్స్ రూపంలోనూ ప్రదర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్నాథరాజు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు నిర్వహించడం చాలా అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. జగపతి రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.మురళీకృష్ణమ రాజు మాట్లాడుతూ తమ కళాశాల స్టార్టర్ లోను జాతీయ స్థాయిలో జరిగే ఏకతాన్ పోటీలలోనూ ఎన్నో విజయాలు విద్యార్థులు సాధించటంతో కేంద్ర ప్రభుత్వం ఏఐసీటి ఐడియా ల్యాబ్ తో పాటు అటల్ ఇన్నోవేషన్ సెంటర్ కూడా మంజూరు చేసిందని, ఇది తమ కళాశాలకే గర్వకారణంగా పేర్కొన్నారు . కార్యక్రమంలో ఇంజనీరింగ్ కెమిస్ట్రీ హెడ్ డాక్టర్ పి.భవాని,ఇంజనీరింగ్ ఫిజిక్స్ హెడ్ డాక్టర్.ఎమ్ వి.సోమేశ్వరరావు, టెక్నాలజీ సెంటర్ హెడ్ డాక్టర్ గోపాలకృష్ణ మూర్తి ,డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతుల్ని జగన్నాథరాజు అందించారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

విశాలాంధ్ర-టి నరసాపురం: మండలంలో పది పరీక్షలకు ఏర్పాట్లు సర్వం సిద్ధం చేసినట్లు విద్యాశాఖాధికారి టి రామ్మూర్తి తెలిపారు. స్థానిక మానవ వనరుల కేంద్రంలో విలేకరుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఈ నెల 18వ తేదీ నుండి ప్రారంభమయ్యే పదవ తరగతి పబ్లిక్ పరీక్షకు 642 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని ఆయన తెలిపారు. టి నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 256 మంది, బొర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 235 మంది, అప్పలరాజుగుడెం గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రంలో 92 మంది, మర్రి గూడెం గిరిజన ఆశ్రమ పాఠశాల నుండి జీలుగుమిల్లి పరీక్ష కేంద్రంలో 59 మంది మొత్తం టి నరసాపురం మండలం నుండి 642 మంది విద్యార్థులు పదవ తరగతి పబ్లిక్ పరీక్ష హాజరవుతున్నారని ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

నరసాపురంలో టిడిపి ఇన్‌చార్జి ఒంటెత్తు పోకడ

విశాలాంధ్ర-నరసాపురం: నరసాపురం టీడీపీలో నియోజకవర్గ ఇన్‌చార్జి విభజించి పాలించారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చిటికెల రామ్మోహన్‌రావు విమర్శించారు. శనివారం రాయిపేటలో టిడిపి నాయకులు ఆధ్వర్యంలో పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు, రాష్ట్ర కార్యదర్శి చిటికెల రామ్మోహనరావు, కొట్టు పండు, నడిపూడి కృష్ణ, బస్వాని ఏడుకొండలు, చాగంటి ఆనంద్, రెడ్డిం శ్రీను, మాంద్రు హేమలత మాట్లాడుతూ తెదేపా బలోపేతానికి మీరు చేసిన కృషి ఏమిటని ఆయన ప్రశ్నించారు. పార్టీ అభివృద్ధి కి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై మీరు పోరాడింది ఏమి లేదన్నారు. ప్రజలు ప్రక్షాన పోరాడుతున్న మాజీ ఎమ్మెల్యే బందారు మాధవ నాయుడు వ్యక్తి గత విమర్శలు

చేయడం మీ దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు. నరసాపురం 2024 అసెంబ్లీ సీటు పొత్తులో భాగంగా వేరే పార్టీ కి వెళ్ళటానికి కారణం మీరు కదా అన్నారు. టిడిపి పార్టీ 2019 ఎన్నికలలో ఓడిపోవడానికి కారణం మీ నలుగురు కాదా అని ప్రశ్నించారు. వేరే పార్టీకి కొమ్ముకాయడం నిజం కాదా?, ముడుపులు తీసుకోవడం నిజం కాదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ఉద్యమం తోనే మాధవ నాయుడు పై కేసులు నమోదయ్యాయన్నారు.ఈ కార్యక్రమంలో చెంపాటి సత్యనారాయణ రాజు, అంద్రాజు రామన్న, రేవు ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో ఆదివారం నిర్వహించనున్న గ్రూప్-1 పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ , రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కె.ఎస్. జవహర్ రెడ్డికి తెలిపారు.శనివారం విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుండి రానున్న సాధారణ మరియు అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి, గ్రూపు-1 పరీక్షలు నిర్వహణ, జనన మరణ నమోదు

చట్టంపై సూచనలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కె.ఎస్. జవహర్ రెడ్డి వీడియో సమావేశం నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ జిల్లాలో గ్రూపు-1 పరీక్షల నిర్వహణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఏర్పాట్లను సిఎస్ కు వివరించారు. ఈ సందర్బంగా రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కె.ఎస్. జవహర్ రెడ్డి మాట్లాడుతూ రానున్న సాధారణ, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రకటన వచ్చిన నాటి నుండి రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులైన జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన 24 గంటలు లోగా ప్రభుత్వ ఆస్తులపై అన్ని రకాల వాల్ రైటింగులు,పోస్టర్లు,కటౌట్లు, హోర్డింగులు,బ్యానర్లు,జెండాలు వంటివన్నీ తొలగించాలని ఆదేశించారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రసార మాధ్యమాల్లో ప్రభుత్వ నిధులతో జారీ చేసే అన్ని రకాల అడ్వర్టైజ్మెంట్లను నిలిపి వేయాలని స్పష్టం చేశారు. అంతేగాక ప్రభుత్వ వెబ్సైట్లో మంత్రులు తదితర ప్రజా ప్రతినిధులు,రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫోటోలను వెంటనే తొలగించాలని సిఎస్ జవహర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని అంతటినీ ఆదేశించారు.

ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలి

కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ్ర-భీమవరం: ఉద్యోగులు ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలని, రాజకీయ పార్టీలకు మద్దతుగా పనిచేస్తున్నట్లు తన దృష్టికి వస్తే ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు తీవ్రంగా ఉంటాయని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ హెచ్చరించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో భీమవరం, నరసాపురం, ఉండి నియోజకవర్గాలకు సంభందించి ఆర్వోలు, ఎంపీడీవోలు, ఎఫ్ ఏస్ టి, ఎస్ ఎస్ టి, వి ఎస్ టి, వి వి టి తదితర బృందాలతో ఐ.టి యాప్స్ వినియోగం పై శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు మద్దతుగా ఏ ఒక్క ఉద్యోగి పనిచేసినట్టు తన దృష్టికి వస్తే వారిపై ఎన్నికల నిబంధన మేరకు చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఎవరికి భయపడ కుండా నిర్భయంగా విధులు నిర్వహించాలని ఉద్బోధించారు. ఎన్నికలలో ప్రలోభాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని, నగదు, గిఫ్టులు, గ్యాస్ స్టౌలు, గ్యాస్ బండలు, లిక్కర్, బెడ్ షీట్స్, తదితర పంపిణీలను గుర్తించి నిబంధనలు మేరకు చర్యలు తీసుకోవడంతో పాటు, సీజ్ చేసి వాటిని భద్రపరచాలన్నారు. క్యాష్ ట్రెజరీ, లిక్కర్ ఎక్సైజ్, మిగతా ఐటమ్స్ తహసీల్దార్ కార్యాలయాలలో భద్ర పరచాలన్నారు. ఎన్నికల అధికారులు ప్రతి ఒక్కరు బాధ్యతతో తమ విధులను నిర్వహించాలన్నారు.

చెక్ పోస్ట్ ల వద్ద పూర్తి నిఘా ఉండాలని, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వాహనాలలో మద్యం, నగదు, వస్తువులు తరలిస్తే వెంటనే వాహనాన్ని సీజ్ చేయాలన్నారు. వాహనాల తనిఖీలలో కూడా పక్షపాతం చూపకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు సి.వి. ప్రవీణ్ ఆదిత్య, జిల్లా రెవిన్యూ అధికారి జె.ఉదయ భాస్కర రావు, నరసాపురం ఆర్డీవో, ఆర్వో యం. అమృత అంబరీష్, భీమవరం ఆర్డీవో,ఆర్వో కె.శ్రీనివాసులు రాజు,ఎలక్షన్స్ సూపర్డెంటు సి.హెచ్.దుర్గా ప్రసాదు, డిప్యూటీ తహశీల్దారు యం.సన్యాసి రావు, భీమవరం, నరసాపురం నియోజకవర్గాల యస్ యస్ టి, యఫ్ యస్ టి, వియస్ టి, వివిటి టీమ్స్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు

శ్రీ జగదాంబ అమ్మవారిని దర్శించుకున్న అనిత

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : జీలుగుమిల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ జగదాంబ అమ్మవారు సమీప గ్రామ ప్రజలకు అత్యంత ఇష్టమైన దైవమని పొన్నాల అనిత అన్నారు శనివారం శ్రీ జగదాంబ అమ్మవారి ఉత్సవాల సందర్భంగా ఆమె దర్శించుకున్నారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి యాట ఉత్సవాల రోజున అమ్మవారిని దర్శించుకోవడం అలవాటు అని అన్నారు ఏజెన్సీ గ్రామాలలో శ్రీ జగదాంబ అమ్మవారు అంటే ఎంతో ఇష్టమని అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మోడియం రామచంద్రరావు ఆలయ కమిటీ మాజీ వైస్ చైర్మన్ చిట్టి బొమ్మ సతీష్ నాయకులు కాసా నాగేశ్వరరావు బొంతు రవితేజ నాయకులు పాల్గొన్నారు.

సమీకృత వ్యవసాయంతో ఆర్థిక స్వావలంబన

విశాలాంధ్ర -జీలుగుమిల్లి : దళిత, గిరిజన ఉప ప్రణాళిక 2023-2024 భాగంగా సమీకృత వ్యవసాయంభూ సార పరీక్షల ఆవశ్యకతలపై అవగాహన కార్య క్రమాలను సిటిఆర్ఐ అర్ ఎస్ హెడ్ డా. వై.వి సుబ్బయ్య అధ్యక్షతన నిర్వ హించారు. ఈ కార్యక్ర మాలకు విచ్చేసిన సిటిఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషు మాధవ్ మాట్లాడుతూ చిన్న, సన్న కారు రైతులకు సమీకృత వ్యవసాయంతోనే ఆర్థిక మేలు జరుగుతుందని తెలిపారు. సమీకృత వ్యవసాయ విధానంలో పంటల సాగుతో పాటు పశు సంపద వల్ల కలిగే లాభాలు, పశువుల ఎరువుల వల్ల పంటలకు, పంటల సాగులో వచ్చే పశువుల ఆహార వినియోగాలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ భూసార పరీక్షల ఆధారంగా వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగం ఉండాలని, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులను సాధించాలని కోరారు. డా. వై.వి సుబ్బయ్య మాట్లాడుతూ వ్యవసాయంలో పశువుల ఉపయోగాలు, మనవ జీవితం లో ఆహారపు విధానం,పశువులతో ముడిపడి ఉన్న విషయాలను రైతులకు వివరించారు. పశు సంవర్ధక విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ ఎమ్. సాయి బుచ్చారావు మాట్లాడుతూ పశు పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పశువులలో పాల దిగుబడికి ఇవ్వాల్సిన పోషకాల దానాల గురించి రైతులకు వివరించారు. డాక్టర్ ఎల్ కె ప్రసాద్ మాట్లాడుతూ భూసార పరీక్షల ద్వారా నేల గుణ గణాలను తెలుసుకొని నేల స్వభావం ఆధారంగా పంటల సాగు విధానాన్ని రైతులకు వివరించారు. డా. పూర్ణ బిందు మాట్లాడుతూ భూసార పరీక్షల కోసం మట్టి నమూనా సేకరించే విధానాన్ని రైతులకు తెలియజేశారు. మట్టి సేకరణ విధానం పై కరపత్రాన్ని" విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో 100 మంది దళిత రైతులకు గడ్డ పలుగు,పార , 50 మంది గిరిజన రైతులకు 50 కేజీల పశువుల దాణా బస్తాలను ఉచితంగా అందజేశారు. ఈ కారక్రమంలో సిటిఆర్ఐ సిబ్బంది రమేష్,ప్రభు,మరియు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

సాగునీరు ఇవ్వాలని మత్స్యపురిలో రాస్తారోకో

విశాలాంధ్ర-వీరవాసరం: తక్షణం సాగునీరు అందించి పొట్టదశలో ఉన్న పంట పోలాలను కాపాడాలని పలువురు కౌలు రైతులు అధికారులను డిమాండ్ చేశారు. మండలంలోని మత్స్యపురిలో ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం ఆద్వర్యంలో శనివారం కౌలురైతులు రాస్తారోకో చేశారు. ఈసందర్భంగా కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన

కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ మత్స్యపురి గ్రామంలో సాగునీరు అందక రెండు వందల ఎకరాల్లో పంట పొలాలు ఎండుపోతున్నయన్నారు. కొన్నిచోట్ల వరి చేలల్లో ఎండిన మట్టిగడ్డలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు చింతా నారాయణ మూర్తి, గంటా బాబురావు మాట్లాడుతూ పంటనీరు అందక పోవటంతో గత ఇరవై రోజులుగా బోరు నీరు, చెరువుల్లో విడగొట్టిన నీరు పెట్టామని దీంతో పంట పొలాలు ఎరుపురంగు వచ్చాయని ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణం అదికారులు రావాలని, సాగునీరు అందివ్వాలని డిమాండ్ చేస్తూ సమస్యను ఇరిగేషన్ ఏఇ వీ.సత్యనారాయణ, వ్యవసాయ శాఖ ఏఓ బిన్నీబాబు దృష్టికి తీసుకెళ్లారు. వారు పంట భూముల వద్దకు చేరుకుని పరిశీలించి మాట్లాడుతూ రైతులకు నీరందేలా తగు చర్యలు తీసుకుంటామని, వీఆర్వో, లష్కర్, విఏఏతో టీమ్ వేసి కాలువపై ఇంజన్లు ఆపేలా చర్యలు తీసుకుని సాగునీరు ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌలురైతులు, రైతులు నిప్పులేటి వెంటేశ్వరావు, యాళ్ళ నాగ భాస్కరరావు, గుబ్బల సత్యనారాయణ, దేవిరెడ్డి సూర్యనారాయణ, ఇనుకొండ రాంబాబు, తెన్నేటి వెంకట్రావు, పుప్పాల రాజియ్య,గంటా వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం పునఃనిర్మాణం

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం గ్రామపంచాయితీ ఎస్ సి కమ్యూనిటీ హాల్ , హరిజన పేట వద్ద గణపవరం ఎంపీపీ దండువెంకటరామరాజు(అర్ధవరం రాము) వైయస్సార్ పార్టీ నాయకులు ప్రముఖ వ్యాపారవేత్త కాకర్ల విష్ణు శ్రీనివాసరావు వారి ఆర్థిక సహకారముతో ఉంగుటూరు శాసన సభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) డా. బి ఆర్ అంబేద్కర్ పునఃనిర్మాణ చేసిన విగ్రహాన్ని ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ పార్టీ మండల కన్వీనర్ దండు రాము, గణపవరం సర్పంచ్ మూరా అలంకారం భాస్కరరావు, రాష్ట్ర సూర్య బలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, కాకర్ల విష్ణు శ్రీనివాసరావు, సలాది రత్న దుర్గ కుమారి, రొంగల శ్రీను, నంద్యాల సోమరాజు , మాజేటి సురేష్, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, గ్రామపెద్దలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనినారు.

5 కేంద్రాలలో పదవ తరగతి పరీక్షలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మండలంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు 5 పరీక్షా కేంద్రాలలో జరగనున్నట్లు మండల విద్యాశాఖాధికారి జె .సురేష్ బాబు తెలిపారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల- పరింపూడి 240 మంది విద్యార్థుల, కన్నాపురం 312 మంది విద్యార్థులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల-బయ్యనగూడెం 350 మంది విద్యార్థులు, ఆగ్జిలియమ్ ఉన్నత పాఠశాల - గవరవరం 178 మంది విద్యార్థులు, ఈ పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు మండలంలో 1291 మంది విద్యార్థులు హాజరవుతుండగా, పరీక్షల నిర్వహణ కోసం 5గురు చీఫ్ సూపరింటెండెంట్లను, 5గురు డిపార్ట్మెంటల్ అధికారులను, ఇద్దరు అడిషనల్ డిపార్ట్మెంటల్ అధికారులను,62 మంది ఇన్విజిలేటర్స్ ను జిల్లా విద్యాశాఖాధికారి, ఏలూరు వారు నియమించడం జరిగిందని సురేష్ బాబు తెలిపారు. పరీక్షలు 30-03-2024 నాటికి ముగియనుండగా ప్రధానమైన పరీక్షలు 27-03-2024న ముగియనున్నాయి. అన్ని పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైనటువంటి మౌలిక వసతులు ఏర్పాటు చేసినట్టు ఎంఈఓ సురేష్ బాబు పేర్కొన్నారు.

శ్రీ జగదాంబ అమ్మవారి ఉత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-జీలుగుమిల్లి: శ్రీజగదాంబ అమ్మవారి ఆశీస్సులు అనుగ్రహం కలిగి ఉంటే ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు .శనివారం జీలుగుమిల్లిలో శ్రీజగదాంబ అమ్మవారి 67వ వార్షికోత్సవ ఉత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీజగదాంబ అమ్మవారు కోర్కెలు నెరవేర్చే తల్లిగా ప్రసిద్ధిగాంచారన్నారు. ఆరు రోజులపాటు జరిగే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కమిటీ వారికి సూచించారు. ఆలయ కమిటీ అభివృద్ధికి ఎండోమెంట్ వారితో మాట్లాడి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు ఉత్సవ కమిటీ వారు ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షులు చందా ప్రసాద్, ఎంపీపీ కోర్స పోచమ్మ, జీలుగుమిల్లి సొసైటీ అధ్యక్షులు బోధ శ్రీనివాస్ రెడ్డి, శ్రీజగదాంబ అమ్మవారి ఉత్సవాల కమిటీ చైర్మన్ కక్కిరాల రాము, ఉత్సవ కమిటీ సభ్యులు బొంతు భద్రం, నాయకులు చాట్రాతి భవాని శేఖర్, నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.